క్లుప్తంగా

కాలేజీపై చర్యలు తీసుకోవాలని వినతి



ఖలీల్‌వాడి: బోధన్ పట్టణంలోని విజేత జూనియర్ కాలేజీ పై చర్యలు తీసుకోవాలని డీఐఈవో రవికుమార్ కు టీవీయూవీ నాయకులు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీవీయూవీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ రమావత్ లాల్ సింగ్, టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి కల్యాణ్ రామ్ మాట్లాడుతూ రెండు రోజుల క్రితం బోధన్ లోని విజేత జూనియర్ కళాశాల హాస్టల్లో చదివే విద్యార్థి తప్పిపోయారని, కాలేజీ యాజమాన్యం సౌకర్యాలను కల్పించకపోవడంతోనే విద్యార్థులు హాస్టల్ నుంచి వెళ్లిపోతున్నట్లు ఆరోపించారు.కార్యక్రమంలో విద్యార్థి నాయకులు అఖిల్ వెంకటేష్ పాల్గొన్నారు.

హెచ్‌సీఏ లీగ్ మ్యాచ్‌లో నిజామాబాద్ జట్టు విజయం



నిజామాబాద్‌నాగారం: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న లీగ్ మ్యాచ్‌లో జిల్లా జట్టు విజయం సాధించింది. రెండు రోజులుగా నిజామాబాద్ వర్సెస్ జై భగవతి జట్ల మధ్య లీగ్ మ్యాచ్ జరిగింది. ఇందులో మొదట టాస్ గెలిచి జిల్లా జట్టు 78 ఓవర్లలో 492 పరుగులు చేసింది. ఇందులో అజిత్ దామ–261 నాటౌట్, విక్రాంత్‌రెడ్డి 114 పరుగులతో రాణించారు. జై భగవతి జట్టు 31.5ఓవర్లలో 103 పరుగులు చేసి ఆలౌటైంది. నిజామాబాద్ జట్టులో మనోహర్‌టూక్–5వికెట్లతో ఆదరగొట్టాడు. దీంతో జిల్లా జట్టు 389 పరుగులతో గెలిచింది.

హామీల అమలులో విఫలం



నిజామాబాద్ అర్బన్: కాంగ్రెస్ పార్టీ హామీల అమలులో విఫలమైందని మాజీ జెడ్పీ చైర్మన్, దాదన్న గారి విఠల్‌రావు విమర్శించారు. బుధవారం బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డు పోస్టర్లను ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజు, నాగేశ్వరరావు, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు

చదువుతో పాటు క్రీడలు అవసరం



ఖలీల్ వాడి: చదువుతోపాటు క్రీడలు అవసరమని సినీ నటి, దర్శకురాలు రోహిణి, సినీ రచయిత, దర్శకుడు డాక్టర్ ప్రభాకర్ జైనీ, రచయిత కవిత్రి, కాళోజీ అవార్డు గ్రహీత నెల్లుట్ల రమాదేవి తెలిపారు. నగరంలోని ముబారక్ నగర్ లోని విజయ్ పాఠశాల 45 వ టాలెంట్ షో ముగింపు కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ ముగింపు కార్యక్రమంలో వారు మాట్లాడుతూ .. 45 సంవత్సరాలు విజయ్ పాఠశాల పూర్తి చేసుకోవడం చాలా గొప్ప విషయమన్నారు. అన్ని రంగాలలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రతిభా పురస్కారాలను అందించారు.అంతకు ముందు ముఖ్య అతిథులను విజయ్ పాఠశాల తరఫున మెమెంటో, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి అమతలత, రమాదేవి, లలితదేవి, విజయ భారతి, విజయ లక్ష్మి, మధు, కరస్పాండెంట్ ప్రభాదేవి అకాడమిక్ డైరెక్టర్ వసంత,అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ సుజాత, ప్రిన్సిపల్ విజేత, అధ్యాపక బందం పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	1,33,500	వెండి(కిలో)	2,00,000
22 క్యారెట్స్	1,23,000		– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	160
		లైవ్	120
స్కిన్‌లెస్	180	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	16	32	గాజరుగడ్డ	60	120
బెండకాయ	40	80	పచ్చిమిర్చి	40	80
బీరకాయ	60	120	దోసకాయ	30	60
దొండకాయ	50	100	ఆలుగడ్డ	30	60
బీర్నీసుకాయ	100	180	గోబిగడ్డ	25	50
కాకరకాయ	40	80	గోబిపువ్వు	40	80
వంకాయ	50	100	బీట్‌రూట్	40	80
పాలకూర	60	120	కరివేపాకు	40	80
మెంతికూర	80	160	చామగడ్డ	40	60
కొత్తిమీర	70	140	చిక్కుడుకాయ	80	160
పుదీనా	60	120	గోరుచిక్కుడు	80	160
క్యాప్సికం	60	120			

–సుభాష్‌నగర్

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పురోగతి

- నిజామాబాద్ అర్బన్‌లో వేగంగా పనులు
- 60 డివిజన్లలో లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం
- కొత్త దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన
- క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న కలెక్టర్, కమిషనర్



గౌతంనగర్‌లో ఇళ్ల నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న కలెక్టర్, కమిషనర్ (ఫైల్)

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగం పుంజుకుంది. మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్, జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ లబ్ధిదారుల జారీలో అవకతవకలు జరగకుండా వార్డు ఆఫీసర్లకు కచ్చితమైన ఆదేశాలు జారీచేశారు. జిల్లాలో ఇప్పటివరకు నత్తనడకన సాగిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయి.

కార్పొరేషన్ పరిధిలో

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 3,500 ఇళ్లకుగాను 8,625 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఇప్పటివరకు 1,855 మందికి ప్రొసీడింగ్స్ ఇచ్చారు. 1017 ఇళ్ల నిర్మాణ పనులు సాగుతున్నాయి. దసరా పండుగ తర్వాత మంచిరోజులు రావడంతో 896 మంది ఇంటి నిర్మాణ పనులు చేపడుతున్నారు.

ఆర్థిక సహాయం..

ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం చేసుకునేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నవారికి మున్సిపల్ అధికారులు ఆర్థిక చేయూత ఇస్తున్నారు. మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాల ద్వారా రూ.లక్ష ఆర్థిక రుణ సహాయం చేయాలని మున్సిపల్ కమిషనర్ టీపీఆర్‌వో రమేష్ గుప్తాను ఆదేశించారు. దాంతో అర్హతగలవారికి రూ.లక్ష ఆర్థిక సహాయం ఇచ్చి వాటితో నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నారు.

'అంగీకార్' అవగాహన కార్యక్రమాలు..

ఇళ్లులేనివారికి ఇందిరమ్మ ఇళ్ల కోసం నగరంలోని 60 డివిజన్లలో వార్డు ఆఫీసర్లు అవగాహన కల్పిస్తున్నారు. 'అంగీకార్' కార్యక్రమం ద్వారా డివిజన్లలో తిరుగుతూ మెప్మా సిబ్బంది, ఆర్పీలు, సీవోలతో కలిసి అవగాహన కల్పిస్తున్నారు. కొత్తగా దరఖాస్తులు సైతం స్వీకరిస్తున్నారు. దరఖాస్తుదారుల వివరాలు పరిశీలించి వారికి ఇందిరమ్మ ఇళ్లను సైతం వెంటనే మంజూరుచేస్తున్నారు.

స్వీయ అప్‌లోడ్.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేసుకునేవారు స్టేజ్–1 నుంచి స్టేజ్–4 వరకు నిర్మాణానికి సంబంధించిన వివరాలు, ఫోటోల అప్‌లోడ్‌లు స్వంతంగా చేసుకునే వీలు కల్పించారు. ఇందిరమ్మ ఇళ్లు యాప్‌లో లబ్ధిదారుల ఆధార్ నంబర్‌తో ఎంట్రీచేసి ఓటీపీ ద్వారా నిర్మాణ పనులను, సంబంధిత ఫోటోలను లబ్ధిదారులే నేరుగా అప్‌లోడ్ చేసుకోవచ్చు. వారికి సంబంధించిన బిల్లుల వివరాలు సైతం తెలుసుకునే వెలుసుబాటు కల్పించారు.

దళారులకు కళ్లెం..

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, పత్రాల అప్‌లోడ్, వెరిఫికేషన్ చేయిస్తామంటూ కొందరు దళారుల అవతారం ఎత్తుతున్నారు. అమాయకుల వద్ద నుంచి రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారు. బల్దియాలో కొన్ని వార్డుల్లో మున్సిపల్ కమిషనర్‌తోపాటు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు వచ్చాయి. 1వ డివిజన్ పరిధిలో లబ్ధిదారుల నుంచి ఒక్కొక్కరి నుంచి రూ.5 వేలు వసూలుచేసినట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఎవరికి ఒక్క రూపాయి కూడా ఇవ్వవద్దని లబ్ధిదారులకు కమిషనర్, సంబంధిత అధికారులు సూచిస్తున్నారు. టోల్‌ఫ్రీ నంబర్‌కు (18005995991) ఫిర్యాదు చేయాలని సూచించారు.

అమాయకులను మోసం చేస్తే కఠిన చర్యలు

మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్‌తోపాటు జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నారు. నిర్మాణ పనులు లబ్ధిదారులను అడిగి తెలుసుకుంటున్నారు. సమస్యలుంటే వెంటనే పరిష్కరిస్తున్నారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని వార్డు ఆఫీసర్లు, ఏఈ, డీఈలకు ఆదేశాలు జారీచేశారు. అమాయకులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వార్డు ఆఫీసర్లకు, ఇతర సిబ్బందికి తీవ్రంగా హెచ్చరికలు జారీచేశారు.

నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని సిబ్బందిని ఆదేశించాను. కలెక్టర్ ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిపై ఎప్పటికప్పుడు రిపోర్టులు అడుగుతున్నారు. సంబంధిత టీపీఆర్‌వో, ఏఈలు, డీఈలతో పనుల పురోగతిని సమీక్షిస్తున్నా. లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– దిలీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

వాలీబాల్ పోటీల్లో యువత సత్తా చాటాలి



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న డీసీపీ బస్వారెడ్డి

జక్రాన్‌పల్లి : జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో యువత సత్తా చాటాలని అడిషనల్ డీసీపీ బస్వారెడ్డి, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి అన్నారు. జక్రాన్ పల్లిలో మండల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి యూత్ వాలీబాల్ పోటీలను బుధవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా యువత డ్రగ్స్, చెడు వ్యసనాలకు దూరంగా ఉండేందుకు యువత కోసం వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిజామాబాద్ డివిజన్ పరిధిలోని జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో 16 గ్రామాల నుంచి 16 టీంలను ఏర్పాటు చేశామన్నారు. ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ మునిపల్లి సాయి రెడ్డి, డిచ్‌పల్లి ల్ సీఐ వినోద్, జక్రాన్‌పల్లి ఎస్ఐ మాలిక్ రెహమాన్, హెచ్ఎం లింగన్న, నాయకులు నర్సారెడ్డి, బాలకిషన్, గంగారెడ్డి, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు



ఆటో డ్రైవర్లను హెచ్చరిస్తున్న ఎస్ఐ ఎండీషరీఫ్

డిచ్‌పల్లి: ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించకుండా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని డిచ్‌పల్లి ఎస్ఐ మహమ్మద్ షరీఫ్ హెచ్చరించారు. బుధవారం డిచ్‌పల్లి రైల్వే స్టేషన్ వద్ద నిత్యం తీవ్ర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతున్న దృష్ట్యా ఆటో డ్రైవర్లతో ఎస్ఐ మాట్లాడారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఆటో డ్రైవర్లు సహకరించాలని సూచించారు. అలాగే ఆర్టీసీ బస్సులను కొత్తగా ఏర్పాటు చేసిన రిక్వెస్ట్ బస్‌స్టాప్ వద్దనే నిలుపాలని బస్సు డ్రైవర్లకు సూచించారు. రైల్వే స్టేషన్ ఎదుట రోడ్డుకు ఇరువైపులా అక్రమంగా వేసుకున్న షెడ్లను తొలగించాలని లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యాపారులను హెచ్చరించారు. రైల్వే స్టేషన్ పరిసరాలలో పెరిగిన పిచ్చిమొక్కలను, వ్యర్థపదార్థాలను తొలగించారు. కానిస్టేబుల్స్ వినోద్, రాజేందర్, దశరథ్, ఆర్టీసీ కంట్రోలర్ చందర్‌నాయక్, ఆటో డ్రైవర్ల తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై ధాన్యం ఆరబెడితే చర్యలు : మోపాల్ ఎస్ఐ సుస్మిత

మోపాల్: రోడ్లపై ధాన్యాన్ని ఆరబెడితే రైతులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని మోపాల్ ఎస్సై జెడ్ సుస్మిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రైతులు రహదారులపై ప్రయాణికులకు ఇబ్బంది కలిగించే విధంగా వరి, మొక్కజొన్న, సోయా తదితర పంటలను రోడ్లపై ఎండబెట్టవద్దని పేర్కొన్నారు. రోడ్లపై కాకుండా కళ్లాల్లో ధాన్యాలను ఆరబెట్టుకోవాలని పేర్కొన్నారు. రైతులు సామాజిక బాధ్యతగా వ్యవహరించాలని ఎస్ఐ సూచించారు.

ఉత్తమ వైద్యులుగా సేవలందించాలి



ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి దంపతులతో ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

- దేశంలోనే నిజామాబాద్ మెడికల్ కళాశాలకు మంచి పేరు ఉంది
- ర్యాగింగ్ భూతానికి దూరంగా ఉండాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి
- మెడికల్ కళాశాలలో ఎలేగ్జర్–2025 వేడుకలు

నిజామాబాద్‌నాగారం: దేశంలో నిజామాబాద్ మెడికల్ కళాశాలకు మంచి పేరు ఉందని, మంచిగా చదువుకొని భవిష్యత్తులో ఉత్తమ వైద్యులుగా సేవలందించాలని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో నిర్వహించిన ఎలేగ్జర్–2025 వేడుకలకు సుదర్శన్ రెడ్డి తన సతీమణి సుచరిత రెడ్డితో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా మెడికల్ కాలేజీలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రొఫెసర్లు ఉత్తమ బోధన అందించాలన్నారు. మెడికల్ కాలేజీ తాను తెచ్చినంత మాత్రాన వైద్య వృత్తిలో రాణించి పేదవారికి నాణ్యమైన వైద్యం అందించినప్పుడే తన లక్ష్యం నెరవేరుతుందన్నారు. ఆరు నెలల తర్వాత వైద్య వృత్తి చదివే విద్యార్థులకు కోసం మెడికల్ కాలేజీలో అత్యాధునిక హాస్టల్ వసతిని కల్పిస్తామన్నారు. మెడికల్ కళాశాలలో ర్యాగింగ్ అనేపదం వినకుండా ప్రొఫెసర్లు ప్రిన్సిపల్ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు కూడా ర్యాగింగ్ కు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం నుంచే కాకుండా వేదికపై ఉన్నవారు కూడా స్వచ్ఛందంగా డబ్బులు అందివ్వాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే మాట ప్రకారం కాకతీయ విద్యా సంస్థల చైర్మన్ రజనీకాంత్ రూ. 50,000, బోధన్ ఎమ్మెల్యే సతీమణి సుచరిత రూ. 50,000 ఎన్‌డీసీసీబీ బ్యాంక్ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి రూ. 50 వేలు మెడికల్ కాలేజీ అభివృద్ధికి ప్రకటించారు. అనంతరం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సుచరిత దంపతులకు మెడికోలు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపారు. మెడికోల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హుందాన్, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ కృష్ణమోహన్, జీజీహెచ్ సూపరింటెంట్ శ్రీనివాస్, ప్రొఫెసర్లు జలగం తిరుపతిరావు, నాగమోహన్, సూపరింటెండెంట్ నాగరాజు, వైద్యులు, వైద్యురాలు కవిత రెడ్డి, మెడికోలు, తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మలతో మెడికోలు

సంక్షిప్తం

ఖాళీ సీట్లను భర్తీ చేయాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం కోర్సులలో ఇటీవల జరిగిన ప్రవేశాల్లో మిగిలిపోయిన ఖాళీ సీట్లను స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తెయూ పరిపాలనా భవనం ఎదుట దర్నా నిర్వహించిన అనంతరం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి కి వినతిపత్రం అందజేశారు.పీడీఎస్‌యూ జిల్లా నాయకులు నసీర్, వినోద్, వైష్ణవి, సృజన్, సుష్మా, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్‌కలాంకు నివాళులు

సిరికొండ: మండల కేంద్రంలోని కిడ్స్‌పార్క్ పాఠశాలలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం జయంతిని బుధవారం నిర్వహించారు. కలాం చిత్ర పటానికి కరస్పాండెంట్ జాకీర్ హుస్సేన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేశాయ్ కంపెనీ దోపిడీని అరికట్టాలి



సిరికొండ: బీడీ కార్మికులను నిలువు దోపిడీ చేస్తున్న దేశాయ్ బీడీ ఫ్యాక్టరీ అక్రమాలను అరికట్టాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఆర్ రమేశ్ డిమాండ్ చేశారు. గడ్కోల్ గ్రామంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతు దేశాయ్ బీడీ ఫ్యాక్టరీ వారు కార్మికులకు వెయ్యి బీడీలకు రూ.10 తక్కువగా చెల్లిస్తున్నారని, తిను బండారాలను అంటగడుతున్నారని ఆరోపించారు. కిషోర్, లింబాద్రి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్.ఎస్.ఆర్. డిగ్రీ కాలేజీలో సెమిస్టర్ పరీక్షలు

ఖలీల్ వాడి: నగరంలోని ఖలీల్ వాడిలోని ఎస్ఎస్ఆర్ డిగ్రీ కాలేజీ(అటానమస్)లో డిసెంబర్‌లో జరిగే డిగ్రీ ప్రథమ సంవత్సరం సెమిస్టర్–1 పరీక్షలకు ఫీజు చెల్లించాలని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మారయ్య గౌడ్ తెలిపారు. విద్యార్థులు పరీక్షా ఫీజు చెల్లించడానికి అక్టోబర్ 28 చివరి తేదీ అని చెప్పారు.

చేతుల పరిశుభ్రతతో రోగాలు దరిచేరవు

నిజామాబాద్ నాగారం: చేతుల పరిశుభ్రతతో రోగాలు దరిచేరవని ఆరోగ్య విద్యా బోధకులు ఘన్పూర్ వెంకటేశ్వర్లు అన్నారు. గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే సందర్భంగా బుధవారం కోటగల్లి శంకర్ భవన్ ప్రాథమిక పాఠశాలలో చేతులు శుభ్రం చేసుకునే విధానంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచందర్ గైక్వాడ్, టీచర్లు సౌందర్య, ముకుంద్, సంతోష్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

దంతాలను శుచిగా శుభ్రం చేసుకోవాలి

నిజామాబాద్ నాగారం: దంతాలను ప్రతిరోజు శుచిగా శుభ్రం చేసుకోవాలని దంత వైద్యుడు వినోద్ పవర్ విద్యార్థులకు సూచించారు. నగరంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో బుధవారం రోటరీ క్లబ్ ఆఫ్ జెమ్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆయన దంతాల సంరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యార్థులకు ఉచితంగా టూత్‌బ్రష్, పేస్టులు క్లబ్ అధ్యక్షులు నరసింహారావు అందజేశారు.క్లబ్ సెక్రటరీ గంజి రమేష్, కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి

సుభాష్‌నగర్: ఆర్యవైశ్య పేద, ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఆర్థికసాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని, ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని శ్రీ వాసవి సేవ సమితి ట్రస్ట్ వ్యవస్థాపకులు అర్వపల్లి పురుషోత్తం గుప్తా తెలిపారు. నగరంలోని అర్వపల్లి పురుషోత్తం కళ్యాణమండపంలో శ్రీ వాసవి సేవ సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యానిధి ద్వారా 20 మంది పేద, ప్రతిభ కలిగిన ఆర్యవైశ్య విద్యార్థులకు రూ.21వేల చొప్పున ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈసందర్భంగా అర్వపల్లి పురుషోత్తం గుప్త మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా రెండేళ్లలో 100 మంది ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఆర్థికసాయం అందజేశామన్నారు. ట్రస్ట్ ప్రతినిధులు, అతిథులు డాక్టర్ వెంకటరమణ, ముక్కా వినోద్, పాల్దె లక్ష్మీకాంతం, పాల్దె రాజేశ్వర్, ట్రస్ట్ అధ్యక్షుడు మోటూరి మురళీ, గజవాడ హన్మంత్ రావు, విశ్వనాథం, శ్రీనివాస్, ట్రస్ట్ సభ్యులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డైట్ కళాశాలలో సీపీఆర్‌పై అవగాహన

నిజామాబాద్‌నాగారం: నగరంలో డైట్ కళాశాలలో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఇందులో డాక్టర్ వెంకటేష్, డీహెచ్ఈ వేణుగోపాల్‌లు విద్యార్థులు సీపీఆర్‌పై డెమో చేసి చూపించారు. కాలేజీ అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టపాకాయల దుకాణాదారులకు ..

నిజామాబాద్ అర్బన్: నగరంలోని టపాకాయల దుకాణదారులకు బుధవారం సీపీ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఏసీపీ రాజా వెంకటరెడ్డి దీపావళి సందర్భంగా టపాకాయల గోడౌన్ల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో రోబోటిక్స్‌కు ప్రాధ్యానత



ఖలీల్ వాడి: అన్ని రంగాల్లో రోబోటిక్స్ కు ప్రాధాన్యత ఉంటుందని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ రంగ రత్నం తెలిపారు. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కళాశాల లోని భౌతికశాస్త్ర విభాగం, హైదరాబాద్ లోని సోహం అకాడమీ సయుక్తంగా రోబోటిక్స్ పై బుధవారం కార్యశాల నిర్వహించారు. కార్యశాల సమన్వయకర్త డాక్టర్ పి.రామకృష్ణ పరీక్షల నియంత్రణ అధికారి భరత్ రాజ్, డాక్టర్ రాజేష్, గణిత విభాగాధిపతి జయప్రసాద్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి కిరణ్ కుమార్ గౌడ్, అధ్యాపకులు పద్మ రాములు తదితరులు ఉన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

మోపాల్: మోపాల్ మండలకేంద్రంలో పశు వైద్య, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో బుధవారం పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణా టీకాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా మండల పశువైద్యాధికారి డాక్టర్ జి శిరీష మాట్లాడుతూ 432 గేదెలు, 34 ఆవులకు గాలికుంటు నివారణా టీకాలు ఇచ్చామన్నారు. లైవ్‌స్టాక్ అసిస్టెంట్ మురారి, సురేష్, గోపాలమిత్రలు రజనీకాంత్, రాజశేఖర్, పాడి రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



బోర్గాం(పి)లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ వైస్ చైర్మన్, క్లస్టర్ అధికారి

మోపాల్: రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర, బోనస్ పొందాలని ఎన్‌డీసీసీబీ వైస్ చైర్మన్ నల్ల చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరశివారులోని బోర్గాం(పి), తాడెం గ్రామాల్లో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సహకార శాఖ క్లస్టర్ ఆఫీసర్ సరస్వతితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని, నష్టపోవద్దని సూచించారు. ముఖ్యంగా గన్నీ, ట్రాన్స్‌పోర్ట్, ఇతర ఎలాంటి సమస్యలున్నా.. తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ ఈగ జయకృష్ణారెడ్డి, డైరెక్టర్లు, మాజీ సర్పంచులు ఈగ సాయిరెడ్డి, మహేందర్‌రెడ్డి, సడక్ శేఖర్‌రెడ్డి, గంగదాస్, కామర్స్ మోహన్, భుజేందర్ రెడ్డి, సాయిబాబా, చిట్టి సాయిరెడ్డి, నారాయణ రెడ్డి, సొసైటీ కార్యదర్శి కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి సొసైటీ ఆధ్వర్యంలో..

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి సొసైటీ ఆధ్వర్యంలో కొరట్‌పల్లి, కొరట్‌పల్లి తండ, సుద్దులం, యానంపల్లి, లింగసముద్రం, నడిపల్లి తండా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సొసైటీ చైర్మన్ ఎం.రాంచందర్‌గౌడ్ ప్రారంభించారు. సొసైటీ వైస్ చైర్మన్ కుమ్మరి చిన్న గంగారాం, డైరక్టర్లు తేనేటి రాజవ్వ, చెప్యాల సాయమ్మ, అంకం లత, దాసరి రాము, ఎడ్ల శాంసన్, సొసైటీ సీఈవో ఓస సాయిలు, సిబ్బంది, వీడీసీ సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



నడిపల్లి రైతు వేదికలో చిన్నపిల్లల తల్లిదండ్రులకు కిట్ అందజేస్తున్న డీడబ్ల్యూవో రసూల్‌బీ

డిచ్‌పల్లి/మోపాల్: ఆడపిల్లలు కిశోర బాలికలుగా ఉన్నప్పుడే రక్తహీనత లేకుండా సరైన పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా సంక్షేమాధికారిణి రసూల్ బీ సూచించారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా బుధవారం డిచ్‌పల్లి మండలం నడిపల్లి రైతు వేదికలో, మోపాల్ రైతు వేదికలో వేర్వేరుగా నిర్వహించిన ముగింపు ఉత్సవాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బలవర్ధకమైన ఆహారం తీసుకుంటే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. బిడ్డ పుట్టగానే ముర్రుపాలు తాగించాలని, 6 నెలలు కేవలం తల్లి పాలు మాత్రమే తాగించాలని, ఏ ఇతర పానీయాలు ఇవ్వకూడదని వివరించారు. బేటీ దినోత్సవంలో భాగంగా ఇటీవలే పుట్టిన ఆడపిల్లలకు కిట్లు అందజేశారు. కార్యక్రమంలో సీడీపీవో జ్యోతి, అర్బన్ సీడీపీవో సౌందర్య, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుశాంత్, ఏపీఎం రవీందర్, హెచ్ఈవో శంకర్, జిల్లా కోఆర్డినేటర్ ప్రకాష్, పోషన్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ రాంబాబు, బ్లాక్ కోఆర్డినేటర్ రంజిత్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు మమత, బుజ్జి, శోభ, రాధాలక్ష్మీ, సునీత, వరలక్ష్మీ, సరిత, భాగ్య, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తల్లులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



ధర్పల్లిలో మాట్లాడుతున్న చక్రపాణి

ధర్పల్లి: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేసి, ప్రభుత్వం గ్రీన్ ఛానల్ విధానాన్ని అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మధ్యాహ్నం భోజన కార్మికులతో కలిసి బుధవారం సమావేశాన్ని నిర్వహించి ఆయన మాట్లాడారు. బకాయిలు రాకపోవడంతో ఈనెల 13 నుంచి కార్మికులు నల్ల బ్యాడ్జీలు పెట్టుకుని వంటలు చేస్తూ నిరసనను వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు.కార్యక్రమంలో నాయకులు శారద, లతా, రాజమణి, నవీన్, మధ్యాహ్న భోజన కార్మికులు తదితరులున్నారు.

రాష్ట్రబంద్‌ను విజయవంతం చేయాలి

నిజామాబాద్ సిటీ: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాల జేఏసీ ఈనెల 18న చేపట్టిన రాష్ట్ర బంద్ కు సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) మద్దతు తెలుపుతుందని నగర కార్యదర్శి ముస్కె సుధాకర్ కోరారు. బుధవారం జిల్లాకేంద్రంలోని కోటగల్లి ఎన్ఆర్‌భవన్‌లో నిర్వహించిన సమావేశంలోఆయన మాట్లాడారు. నాయకులు కామ్రేడ్ గోదావరి, కె.సంధ్యారాణి, మహేందర్, మహిపాల్ తదితరులున్నారు.

బీసీ బంద్‌కు ఆమ్ ఆద్మీ పార్టీ మద్దతు

నిజామాబాద్‌నాగారం: ఈ నెల 18న చేపట్టిన బీసీ బంద్‌కు ఆమ్‌ఆద్మీ పార్టీ పూర్తి మద్దతు ఇస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు సమీర్ ఆహ్మద్ తెలిపారు. నగరంలోని పార్టీ కార్యలయంలో మాట్లాడారు. ఇందులో నాయకులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాల్సిందే

నిజామాబాద్ సిటీ : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిందేనని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్ బాబు అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 18 నిర్వహిస్తున్న రాష్ట్ర బంద్‌కు సీపీఎం పూర్తి మద్దతు ఉంటుందన్నారు. సమావేశంలో పెద్ది వెంకట్ రాములు, నాగన్న, గంగాధర్, లక్ష్మీనారాయణ, బొబ్బిలి నరసయ్య, నాగరాజ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.